
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
ఆదివారం 9 మార్చి 2025



‘బీడీ’ బతుకులు ఆగం

నెలంత కష్టపడ్డా వచ్చేది రూ. 3 వేలే
పూట గడవక ఇబ్బందులు
తగ్గిన పనిదినాలు
గతంలో రోజుకు కోటి ఉత్పత్తి
నేడు 70 లక్షలు మాత్రమే
దూరంగానే నేటితరం

7



మహిళా దినోత్సవం సందర్భంగా..

ఐఎంఏ నిర్వహించిన వాకథాన్‌లో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సంగారెడ్డిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సంగారెడ్డి డాక్టర్స్ క్లబ్ సంయుక్తంగా వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరై జ్యోతి వెలిగించి వాకథాన్‌ను ప్రారంభించారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణ, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కోసం నిర్వహించిన వాకథాన్ ర్యాలీ సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణలో ముందు జాగ్రత్తలు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా.కిరణ్‌కుమార్, సెక్రటరీ డా.ఆనంద్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో నిర్వహించిన వాకథాన్‌లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



వాకథాన్‌లో పాల్గొన్న ఐఎంఏ డాక్టర్లు



మహిళా పేషెంట్‌కు మందులు అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సండే స్పెషల్
Sunday Special

శుభకార్యం ఏదైనా..

‘ఈవెంట్’ హంగామా



విందులో వెల్కమ్ డ్యాన్స్

గతంలో పెళ్లంటే పదహారు రోజుల పండగ. నెల రోజుల హడావుడి. ఉమ్మడి కుటుంబంలో ఉండేవారందరితో పాటు బంధుమిత్రులు, స్నేహితులు తలో చేయివేసేవారు. అయినా ఆఖరి నిమిషంలో హడావుడి పడాల్సి వచ్చేది. పెళ్లి మాత్రమే కాదు ఏ శుభకార్యమైనా పదిమంది కలిసి పని పంచుకునేవారు. కానీ, ఇప్పుడంతా రెడీమేడ్. పెళ్లయినా.. శుభకార్యమైనా డబ్బులుంటే చాలు కొండమీది కోతిని కిందికి దించి, అంగరంగవైభవంగా ఏర్పాట్లు చేసే ఈవెంట్ సంస్థలు పుట్టుకొచ్చాయి. డేట్ ఫిక్స్ చేసుకుంటే చాలు.. మిగిలిన పనంతా చేసిపెడతారు... ముహూర్తం సమయానికి మండపంలోకి రావడమే తరువాయి. ఇప్పటివరకు నగరాలకే పరిమితమైన ఈవెంట్ మేనేజమెంట్ సంస్కృతి ఇప్పుడు పట్టణాలు, పల్లెలకు కూడా చేరుకుంది. హైదరాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరంలో మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్‌లో ఇప్పుడు ఏ శుభకార్యమైనా ఈవెంట్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి అయ్యింది.

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన సంస్కృతి
ఏ ఫంక్షనైనా ఘనంగా జరిపిస్తున్న సంస్థలు
బడ్జెట్‌కు అనుగుణంగా ఏర్పాట్లు
నారాయణఖేడ్‌లోనే నాలుగు సంస్థలు

7



రంజాన్ వేళలు

ఆదివారం ఇఫ్తార్: సాయంత్రం 6.30
సోమవారం సహర్: ఉదయం 5.06

మెదక్ ‘సాయ్’ సెంటర్‌ను పునర్ ప్రారంభించండి

మన్‌సుఖ్‌కు జితేందర్, శివసేనారెడ్డి విజ్ఞప్తి 7

కస్తూర్బాలో జీసీడీవో విచారణ

7

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
రంగంపేట పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ 7



గ్రామ పాలనాధికారులు

వచ్చేస్తున్నారు

- మళ్లీ గ్రామాలకు భూపరిపాలన అధికారులు
- భూభారతి చట్టం ద్వారా కొత్త వ్యవస్థ
- మెదక్ జిల్లాలోని 1,033 వీఆర్వోలు ప్రస్తుతం ఇతర శాఖల్లో విధులు

మెదక్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఇటీవల సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 10,954 గ్రామాలకు గ్రామ పరిపాలనాధికారులను నియమించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. రెవెన్యూ వ్యవస్థలో నెలకొన్న అవినీతికి వీఆర్వోలే కేరాఫ్ అని భావించి గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థలనే 2020 సెప్టెంబరులో రద్దుచేసింది. అప్పటికే వీఆర్‌వోలుగా, వీఆర్‌ఏలుగా పనిచేస్తున్న వారిని వారి అర్హతల ఆధారంగా ఇతర శాఖలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, అటెండర్లుగా నియమించింది. కానీ, వీఆర్వో వ్యవస్థ రద్దయిన అనంతరం అవినీతి మరింత పెరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆన్‌లైన్‌లోనే అన్ని పనులు

వీఆర్వో వ్యవస్థ రద్దు అనంతరం భూ సమస్యలు చెప్పుకుంటే వినడానికి ఒక్క అధికారి కూడా ప్రజలకు అందుబాటులో లేరని రైతులు వాపోతున్నారు. వీఆర్వోలు రెవెన్యూ సంబంధిత విషయాల్లోనే కాకుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనల్లోనూ కీలకంగా వ్యవహరించేవారు. ప్రస్తుతం భూ సంబంధ సమస్య ఏదైనా తహసీల్దార్ ఆఫీసులో చెప్పుకోవాల్సి వస్తున్నది. వారు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ, మీసేవల్లో ధరణి పోర్టల్ ఓపన్ చేసి దరఖాస్తు చేస్తే రూ. వెయ్యి వసూలు చేస్తున్నారు. అంత చెల్లించినా ఆఖరు నిమిషంలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరిస్తారని ముందునుంచీ చెప్పుకుంటున్నారు. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 22 మండలాలకు 469 గ్రామాలున్నాయి. ప్రస్తుతం ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక పరిపాలనాధికారిని నియమించనున్నారు. గతంలో పనిచేసిన 1,033 మంది వీఆర్వోలు ప్రస్తుతం ఇతర శాఖల్లో విధులు నిర్వహిస్తుండగా.. వారికి మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. విద్యార్హతలు, వయస్సు అనుభవం ఆధారంగా ఇప్పటికే వీరంతా ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకున్నారు. మరో 149 మంది వీఆర్వోలు రెవెన్యూ శాఖలోనే పనిచేస్తున్నారు.

1984 నుంచి అనేక మార్పులు

రాష్ట్రంలో వీఆర్వో వ్యవస్థ 1984 నుంచి అనేక మార్పులకు గురవుతూ వస్తోంది. ఎన్టీఆర్ మొదటిసారి అప్పటి సీఎం అయిన వెంటనే పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. అనంతరం 1985లో వీఏవోలను నియమించారు. 1992లో మరోసారి వీఏవోలను రద్దుచేసి పంచాయతీ కార్యదర్శులను నియమించారు. అనంతరం 2007లో పంచాయతీ కార్యదర్శుల వద్ద నుంచి రెవెన్యూ విధులను విడదీసి మళ్లీ వీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2022లో మరోసారి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు. తాజాగా గ్రామస్థాయి పాలనాధికారిని ప్రవేశపెడుతున్నారు. అయితే, ఈసారి పక్కాగా అవినీతి, అక్రమాలు, పొరపాట్లకు తావులేకుండా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

కబ్జా కోరల్లో పెద్దవాగు

- కోట్ల విలువైన 31 గుంటల స్థలం కలిపేసుకున్న గేటెడ్ కమ్యూనిటీ
- జీహెచ్‌ఎంసీ నోటీసులకు స్పందించని బిల్డర్
- హైడ్రాకు స్థానికుల ఫిర్యాదు
- నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్‌లు జారీ చేసినా స్పందన కరువు



పటాన్‌చెరు పెద్దవాగు

పటాన్‌చెరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నుంచి పటాన్‌చెరు వరకు విస్తరించిన పెద్దవాగు కబ్జాలతో కుచించుకుపోతోంది. లింగంపల్లి గోపిచెరువు నుంచి వరదనీరు ప్రవహించి పటాన్‌చెరు మీదుగా విస్తరించిన పెద్దవాగు చివరకు నక్కవాగులో కలుస్తుంది. చుట్టుపక్కల కాలనీల డ్రైనేజీ నీరు కలిసి ఇప్పటికే వాగు ఆనవాళ్లు కోల్పోతున్నది. ఇది చాలదన్నట్లు ఓ భారీ గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏకంగా వాగు బఫర్ జోన్‌ను ఆక్రమించింది. ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకంజ వేస్తున్నారు.

కోట్లు విలువైన బఫర్‌జోన్ మాయం

పట్టణ శివారులోని పెద్దవాగు బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే స్థలంలో సుమారు 31 గుంటల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి పార్క్, ఆటస్థలంగా లేఅవుట్‌లో చూపించారు. కాలనీ కోసం నిర్మించిన క్లబ్‌హౌజ్‌లోని కొంత పార్ట్ సైతం నాలా బఫర్ పరిధిలోకి వస్తుందని భావిస్తున్నారు. కాలనీ లేఅవుట్ ఏర్పాటు సమయంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేసినా అప్పట్లో ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకోవడంతో విషయం బయటకు పొక్కలేదు. తరువాత కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని అమ్మకాలు కూడా జరిగిపోయాయి. నిబంధనల ప్రకారం పెద్దవాగు మధ్యలోంచి బఫర్ జోన్ 24 మీటర్లు ఉండాల్సి ఉండగా కేవలం 12 మీటర్లు మాత్రమే ఉండటంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే కాలనీలోకి వరద నీరు ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది. గతేడాది భారీ వర్షాలకు చుట్టు పక్కల ఉన్న నందన్ కౌంటీ, సింఫనీపార్క్, హోమ్స్ తదితర కాలనీలలో మోకాలు లోతు వరద నీరు వచ్చి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నింబంధనలకు నీళ్లు

జీహెచ్‌ఎంసీ అనుమతితో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ విల్లా ప్రాజెక్టు సంగారెడ్డి నీటిపారుదల డీఈ ఎన్‌వోసీ జారీ చేశారు. వాగు మధ్య నుంచి 15మీటర్ల బఫర్ పరిధిలోకి వచ్చే స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఇచ్చిన ఆదేశాలను సైతం తుంగలో తొక్కారు. కొన్నిచోట్ల కనీసం మూడు నాలుగు మీటర్లు కూడా వదలకుండా మొత్తం లేఅవుట్‌లో కలిపేసుకోవడం వివాదాస్పదమైంది. తరువాత నాలాలు, చెరువులు జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి వెళ్లడంతో నిబంధలు మారిపోయాయి. వాగు బఫర్ జోన్ పరిధిని 15 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచారు. వాగుపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌టెండెడ్ నాలా పరిధిని 48 మీటర్లకు పెంచారు. సదరు నిర్మాణ సంస్థ నిర్వాకంపై ఏకంగా కాలనీకి భూములు ఇచ్చిన రైతులే జీహెచ్‌ఎంసీ, హైడ్రాను ఆశ్రయించడం గమనార్హం.

నోటీసులకు స్పందన కరువు

వాగు బఫర్‌జోన్ కబ్జాపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇరిగేషన్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కబ్జాను ధ్రువీకరించి నోటీసులు జారీ చేసినా బిల్డర్లు స్పందించలేదు. కొందరు నాయకులు అధికారులపై ఒత్తిడి తెవడంతోనే వెనకడుగువేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వాగు బఫర్‌లో నిర్మాణాలు జరిగినట్లు నిర్ధారణ జరిగినా చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



సంగారెడ్డి కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు తీర్పు కాపీని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సత్వర న్యాయం.. సమస్య పరిష్కారం

- జాతీయ లోక్‌అదాలత్‌కు స్పందన
- సంగారెడ్డిలో 14,307, మెదక్‌లో 1,500 కేసుల పరిష్కారం


సంగారెడ్డి క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయమే లక్ష్యంగా నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌లకు మంచి స్పందన వస్తోంది. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో వేలాది కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొత్తం 14,307 కేసులు పరిష్కరించినట్లు ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర తెలిపారు. వీటిలో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 13,715, సివిల్ కేసులు 12, ప్రీలిటిగేషన్ కేసులు 10 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అలాగే, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు 32 పరిష్కరించి బాధితులకు రూ.1,76,97,000 అందజేశారు. 254 బ్యాంకు రికవరీ కేసులు పరిష్కరించడం ద్వారా రూ.1,76,91,867 మొత్తాన్ని బ్యాంకు అధికారులు రికవరీ చేశారు. సైబర్‌క్రైమ్ కేసులు 102 పరిష్కరించి బాధితులకు రూ.7,30,470 అందజేశారు. విద్యుత్ చౌర్యం కేసులు 181 పరిష్కరించి రూ.55,25000 వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం

లోక్‌అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం, సమన్యాయం అందుతుందని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, న్యాయవాదుల సహకారంతో ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం వృథా కాకుండా ఉంటుందని, అలాగే డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కే.జయంతి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి జి.సునీత రవీంద్రరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి రమేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అనిత, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ ప్రభు ధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 1,500 కేసుల పరిష్కారం

మెదక్ అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిన్న గొడవలతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని డబ్బును వృథా చేసుకోవద్దని మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద సూచించారు. శనివారం మెదక్ జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా అప్పీలుకు అవకాశం లేని అంతిమ తీర్పు పొందవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,500 కేసులు పరిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కేసుల్లో రూ.46,32000 రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

సంగారెడ్డి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఒకరు మృతిచెందిన సంఘటన లింగంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకున్నది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జాగ్రు మంజి(47) కూలీ పనిచేసేందుకు మూడురోజుల క్రితం మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామానికి వచ్చాడు. శనివారం తెల్లవారు జామున 65 ముంబయి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. లింగంపల్లి గ్రామ శివారులోని రెడ్డీస్ ల్యాబ్‌కు సంబంధించిన భూమి వద్దకు రాగానే జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం జాగ్రుమంజిని ఢీకొట్టింది. తెల్లవారుజాము కావడంతో ఎవరూ గమనించకపోవడంతో మృతదేహంపై వాహనాలు వెళ్లి శరీరభాగాలు ముక్కలుముక్కలు అయ్యాయి. మృతుడికి సంబంధించిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దీపక్‌కుమార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి రైతు..

దుబ్బాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చెట్టు పైనుంచి పడి రైతు మృతి చెందాడు. దుబ్బాక పట్టణానికి చెందిన ఎంగారి రాజిరెడ్డి(52) ఈనెల 3న చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఆయనను దుబ్బాక ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వస్త్ర వ్యాపారి..

దుబ్బాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వస్త్ర వ్యాపారి మృతిచెందాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కేదారి ముత్తయ్య(75) వస్త్ర వ్యాపారి. శుక్రవారం దుబ్బాకలో దుస్తులను కొనుగోలు చేసి, తిరిగి వెళ్తుండగా పోతారం శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.ట అతడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

తాగుడుకు బానిసై..

కొల్చారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాగుడుకు బానిసైన వ్యక్తి మృతి చెందాడు. చిన్న ఘనపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి సుధాకర్(56) మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. రెండురోజుల క్రితం మద్యం మానేయాలని కుటుంబీకులు సూచించారు. శుక్రవారం భార్య మంజులను మద్యం కోసం డబ్బులు అడగడంతో ఇచ్చింది. దీంతో అతడు ఇంట్లోంచి వెళ్లి కొల్చారం మండలం రంగంపేట వైన్స్ ముందు ఫర్టిలైజర్ షాప్ పక్కన మృతిచెంది ఉన్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఉరేసుకుని కార్మికుడు..


హత్నూర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని కార్మికుడు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం బోర్పట్లలో శనివారం ఉదయం వెలుగుచూసింది. ఎస్‌ఐ సుభాష్ వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం బర్ధమాన్ జిల్లా టక్పూర్‌కు చెందిన బసవేశ్వర్ ముర్ము(22) రెండేళ్ల నుంచి బోర్పట్ల గ్రామ శివారులోని ఆపెటోరియ యూనిట్-1లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి పరిశ్రమకు సమీపంలోని గదుల్లో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం కార్మికులు ఎవరి గదిలో వారు నిద్రకు ఉపక్రమించారు. శనివారం ఉదయం షిఫ్ట్ డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా, బసవేశ్వర్ బయటికి రాకపోవడంతో తోటి కార్మికులు తలుపు తెరిచి చూడగా.. ఉరేసుకుని కనిపించాడు. మృతుడి దగ్గరి బంధువుల ఫిర్యాదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సుభాస్ తెలిపారు.

కడుపునొప్పితో యువకుడు..

మనోహరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లికి చెందిన బాలగోని జయమ్మ,శ్రీనివాస్ దంపతులకు ఒక కూతురు, కుమారుడు వేణు(23) ఉన్నారు. 16 ఏళ్లుగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో అద్దెకు ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ కాళ్లకల్‌లోని ఏషియా పరిశ్రమలో, కుమారుడు వేణు ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వేణు కొంతకాలంగా కడుపునొప్పి కారణంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. శనివారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటిపక్కన ఉన్న స్నేహితుడి ఫోన్‌కు నేను చనిపోతున్నా అని మెసేజ్ పంపాడు. అతడు వెంటనే తల్లిదండ్రులకు సమాచారమందించాడు. వారు వచ్చి తలుపులు తొలగించేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. తల్లి బాలగోని జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


కుటుంబ కలహాలతో రిటైర్డ్ ఉద్యోగి..

పుల్‌కల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాకు చెందిన మూడ్ తుకారం(65) సంగారెడ్డి మండలం ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా విధులు నిర్వహించి ఐదేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. తుకారంకు భార్య మంగ్లీ, ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ల వివాహం చేయగా, ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించాల్సి ఉన్నది. తరచూ కుటుంబ కలహాలు చోటు చేసుకుంటుండటంతో తుకారం మనస్తాపానికి గురయ్యారు. తండాకు వెళ్లి వస్తానని రెండురోజుల క్రితం ఇంట్లో చెప్పి బయలుదేరారు. శనివారం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై తండావాసులు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.















ఆగిన పెళ్లిబాజాలు

● మరికొన్ని గంటల్లో వివాహం

● ప్రేయసితో ఉడాయించిన యువకుడు

చేర్యాల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మరికొన్ని గంటలలో ఏడడుగులు వేయాల్సి ఉన్న తరుణంలో యువకుడు తన ప్రేయసితో ఉడాయించాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలానికి చెందిన ఓ యువతికి, జనగామ జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన ఓ యువకుడికి వివాహ నిశ్చయం జరిగింది. ఈ నెల 9న (నేడు) చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరగాల్సి ఉంది. అందుకోసం ఇరు కుటుంబాలు అన్నీ ఏర్పాట్లు చేసుకున్నాయి. అయితే రెండురోజుల క్రితం యువకుడు తమ స్వగ్రామ సమీపంలోని మరో గ్రామానికి చెందిన యువతితో ఉడాయించాడు. దీంతో విషయం తెలిసిన యువతి కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. పెళ్లి నిలిచిపోవడంతో విచారంలో మునిగిపోయారు. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై ఎస్‌ఐ నీరేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన టాటా ఏస్ వాహనం

● విరిగిపడ్డ రెండు స్తంభాలు, పొలాల్లో చెలరేగిన మంటలు

మనోహరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పిన టాటా ఏస్ వాహనం ట్రాన్స్‌ఫార్మన్‌ను ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు కిందపడి పొలాల్లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండల పరిధిలోని శనివారం చోటు చేసుకున్నది. మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పిట్టలవారు పని నిమిత్తం టాటాఏస్ వాహనంలో కొండాపూర్ గ్రామానికి వెళ్లి వస్తున్నారు. ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోకి రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్నది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి నేలపై పడడంతో పొలంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల రైతులు గమనించి మంటలను ఆర్పేశారు. అలాగే టాటాఏస్‌లోని ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విద్యుత్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సరఫరా నిలిపేసి మరమ్మతులు చేశారు.



విద్యుత్ స్తంభాలు కిందపడడంతో మంటలు చెలరేగి కాలిపోతున్న పొలాలు

విద్యుదాఘాతంతో కిరాణ దుకాణం దగ్ధం

● సుమారు రూ.2 లక్షల నష్టం

మనోహరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ కిరాణ దుకాణం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ సంఘటన మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బండి యాదమ్మ గ్రామంలో రోడ్డు పక్కన కిరాణ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నది. శుక్రవారం రాత్రి రోజులాగే దుకాణం మూసేసి వెళ్లింది. ఉదయం వెళ్లి చూసేసరికి దుకాణం పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల సామగ్రి కాలిపోయింది. రెండురోజుల క్రితమే యాదమ్మ హోలి పండుగ కోసం సామగ్రిని కొనుగోలు చేసింది. బండి యాదమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. ప్రమాదం విషయం తెలిసిన మనోహరాబాద్ మాజీ ఎంపీపీ భర్త పురం రవి ఘటనా స్థలానికి చేరకుని యాదమ్మకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

టింబర్ డిపోలో భారీ అగ్నిప్రమాదం

చేగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చేగుంట పట్టణ కేంద్రంలోని ఓ (సామిల్) టింబర్ డిపోలో ప్రమాదవశాత్తు శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. డిపోలోని యంత్రాలు, విలువైన కలప, రేకుల షెడ్డు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు నష్టం జరిగిందని యజమాని గోవింద్‌పటేల్ పేర్కొన్నారు.

రివార్డు పంపారు... బ్యాంకు ఊడ్చారు..!

రామచంద్రాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ బ్యాంక్ ఎస్‌ఎంఎస్ ద్వారా వచ్చిన ఫేక్ రివార్డు లింకును ఓపెన్ చేసిన ఓ కార్మికుడికి బ్యాంకు ఖాళీ అయిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ బీమాక్ సైబర్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఇతని ఫోన్‌కి ఎస్‌బీఐ బ్యాంక్ పేరిట ఫేక్ ఎస్‌ఎంఎస్ వచ్చింది. ఎస్‌ఎంఎస్ ద్వారా వచ్చిన రివార్డును ఓపెన్ చేయగా ఓటీపీ వచ్చింది. ఓటీపీని ఎంటర్ చేయగానే కార్మికుడి ఖాతాలోని మొత్తం నగదు (రూ.47వేలు) కట్ అయ్యాయి. మోసపోయాయన్న విషయం తెలుసుకున్న సదరు కార్మికుడు న్యాయం చేయాలంటూ కొల్లూరు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సీఐ రవీందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

92 మంది మందుబాబులకు రూ.1.5 లక్షల జరిమానా

కల్హేర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజులుగా సిర్గాపూర్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడిన 92 మందికి నారాయణఖేడ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీధర్ రూ.1.5 లక్షల జరిమానా విధించినట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. శనివారం నారాయణఖేడ్ కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో ఈ 92 మందిని హాజరుపర్చగా జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

కార్తీక.. కలామ్స్ వరల్డ్ రికార్డ్



చెన్నైలో కలామ్స్ వరల్డ్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న పంజాల కార్తీక

రాయపోల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ప్రపంచ రికార్డు సాధించింది. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన పంజాల కార్తీక రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కలామ్స్ వరల్డ్ రికార్డ్స్ వారు ఫిబ్రవరి 25న ఆన్‌లైన్ ద్వారా కెమిస్ట్రీ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో పాల్గొన్న కార్తీక ఆవర్తన పట్టికలలోని 118 మూలకాలను 8సెకండ్ల 85మిల్లీ సెకండ్లలో చెప్పింది. దీంతో నిర్వాహకులు కార్తీకను కలాం వరల్డ్ రికార్డ్స్‌ను అందజేశారు. శనివారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో కలాం వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పంజాల కార్తీకకు రికార్డు, అవార్డును అందజేశారు. కార్తీకను బేగంపేట పాఠశాల హెచ్‌ఎం అంజిరెడ్డి, గైడ్ ఉపాధ్యాయులు కొల్గూరు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీహరికోట షార్ కేంద్రంలో సిద్దిపేట విద్యార్థులు


శ్రీహరికోట క్షేత్రంలో సిద్దిపేట విద్యార్థులు, బోధన సిబ్బంది

సిద్దిపేట క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, బోధన సిబ్బంది శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని (సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం) సందర్శించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ బి.సురేందర్ ఆహ్వానం మేరకు వారు శ్రీహరికోటకు వెళ్లారు. ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి, శాస్త్ర సాంకేతిక రంగంలో భారత దేశ ప్రగతిని ప్రత్యక్షంగా తెలుసుకోవడంలో దోహదపడుతాయని కార్యక్రమ కన్వీనర్ భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సిహెచ్.మధుసూదన్ తెలియజేశారు. శ్రీహరికోట షార్ కేంద్రాన్ని సందర్శించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సునీత విద్యార్థులను, బోధన సిబ్బందిని అభినందించారు.

మెదక్ 'సాయ్' సెంటర్‌ను పునర్ ప్రారంభించండి

● మన్‌సుఖ్‌కు జితేందర్, శివసేనారెడ్డి విజ్ఞప్తి


రైటప్: కేంద్ర మంత్రి మన్‌సుఖ్‌తో జితేందర్, శివసేనారెడ్డి

మెదక్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం కావాలని క్రీడామంత్రి మన్‌సుఖ్ మాండవీయను రాష్ట్ర ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివ సేనా రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్ శివార్లలోని కన్హా ఆశ్రమంలో జరిగిన చింతన్ శిబిర్ రెండో రోజు కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే వివిధ క్రీడా కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందించాలని కోరారు. మెదక్‌లోని 'సాయ్' సెంటర్‌ను తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి జయేష్ రంజన్, శాట్ వీసీ-ఎండీ సోనీ బాలాదేవి, శాట్ అధికారులు వెంకటేశ్వర రావు, నందికిశోర్ గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్చారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ వార్డు, ఐపీ వార్డు, ఏఎన్సీ క్లినిక్‌ను సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, రోగుల వివరాల గురించి, వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరును అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఎప్పుడు చేరారు? ఏం అయ్యింది? ఆరోగ్య పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది? కేంద్రంలో అందించే భోజనం ఎలా ఉంది? మందులు సమయానుగుణంగా ఇస్తున్నారా? టెస్టులకు వచ్చి ఎంతసేపు అవుతుంది? అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం చాలా విలువైందని, ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని రోగులకు సూచించారు. తదుపరి ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజూ ఫాగింగ్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా వైద్యులు, నర్సులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లను, ఓపీ, ఐపీ రిజిస్టర్లను, మందుల నిల్వల రిజిస్టర్‌లను పరిశీలించి, రక్త నమూనాలను అధిక సంఖ్యలో సేకరించి, వాటి రిపోర్టులను సకాలంలో అందించాలని, ఓపీ సేవలను మరింతగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. యాంటీబయోటిక్స్, పాము కాటు మందులు, తదితర ఔషధ నిల్వలను సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, నర్సులకు సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో జీసీడీవో విచారణ



కంగ్టి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో బాలికను చితకబాదిన టీచర్ ఘటనపై శనివారం గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో) సుప్రియ విచారణ చేపట్టారు. కస్తూర్బా విద్యాలయంలో గణిత టీచర్ సురేఖ 9వ తరగతి చదువుతున్న రిష అనే విద్యార్థినితో పాటు మరికొంత మంది విద్యార్థులను చితకబాదడంతో శుక్రవారం బాలికల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయమై శనివారం పాఠశాలను సందర్శించిన జీసీడీవో విద్యార్థినులతో పాటు టీచర్లతో వేరువేరుగా విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా విద్యాధికారితో పాటు కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రహీమొద్దీన్, కోఆర్డినేటర్ మాధవి, ఎస్‌వో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం ఏదైనా..

'ఈవెంట్' హంగామా

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన సంస్కృతి

- పెళ్లయినా.. శుభకార్యమైనా ఘనంగా జరిపిస్తున్న సంస్థలు
- బడ్జెట్‌కు అనుగుణంగా ఏర్పాట్లు
- నారాయణఖేడ్‌లోనే నాలుగు సంస్థలు


విందులో ఖవ్వాలితో పాటు పాన్ స్టాళ్లు

నారాయణఖేడ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శుభకార్యాల కోసం ఏర్పాట్లుచేసే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయి. ఘనమైన పెళ్లయినా.. చిన్నపాటి విందు అయినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో వివాహాలు, శుభకార్యాలు గృహాల ముందే నిర్వహించేవారు. ప్రస్తుతం ఫంక్షన్‌హాళ్లు, బంకెట్‌హాళ్లు, కన్వెన్షన్‌హాళ్లలోనే నిర్వహిస్తున్నారు. మండల కేంద్రాలు, పట్టణాల్లోనూ ఇవి అందుబాటులోకి రావడంతో ఈవెంట్స్ నిర్వహించే సంస్థలు కూడా పెరిగిపోయారు.

అన్ని పనులు క్షణాల్లో..

వివాహాది శుభకార్యాలకు సంబంధించి పసుపుల ముహూర్తం నుంచి పోచమ్మ పండుగ, రాతి కొట్నాలు, మెహిందీ, హల్దీ, మంగళస్నానాలు, సంగీత్, పెళ్లి కూతురి ముస్తాబు తదితర పనులన్నీ చేసిపెడతారు. పెళ్లికి వచ్చే చిన్నారుల కోసం పాప్‌కార్న్, స్మోక్‌బిస్కెట్, టాటూస్, ఐస్‌క్రీమ్స్, స్వాగతం చెప్పడానికి డ్యాన్సర్లు, స్టేజీ అలంకరణ, సౌండ్ సిస్టం, సంగీత విభావరి, ఇతర అన్ని కార్యక్రమాలను ఈవెంట్స్‌వారే చేస్తుండడంతో శుభకార్యాలు జరుపుకునే వారు డబ్బులు కాస్త ఎక్కువ ఖర్చైనా ఎలాంటి ఆపసోపాలకు గురికాకుండా కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి ఈవెంట్స్‌వారిని ఆశ్రయిస్తున్నారు. స్టేజీ డెకరేషన్, వెల్‌కమ్ డెకరేషన్, శోభాయాత్రలకు సైతం లైటింగ్, ఫైర్, స్పార్క్‌లతోపాటు డ్యాన్సలర్లను, బౌన్సర్లను, పెళ్లి కూతురును ప్రత్యేకంగా ఊరేగించడానికి రథం, పెళ్లి కూమారుడి కోసం ప్రత్యేకంగా పందిరి, గుర్రపు స్వారీ, యాంకర్లను కూడా బడ్జెట్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.


వధూవరుల కోసం వేసిన సెట్టింగ్

పసందైన విందు

శుభకార్యాల్లో విందు భోజనాలను కూడా గతంలో వంటల వారితో తయారు చేయించాల్సి వచ్చేది. ప్రస్తుతం క్యాటరింగ్ విధానం రావడంతో మారుమూల ప్రాంతాల్లో సైతం చైనీస్, నార్త్, సౌత్ ఇండియన్ వెరైటీ వంటకాలను, అతిథుల సంఖ్యకు అనుగుణంగా వారి అభిరుచి ప్రకారం విందు సమయానికి అందిస్తున్నారు. విందు అనంతరం వివిధ వెరైటీల పాన్‌లు, శీతలపానీయాలు, పండ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహ సమయంలో భోజనాలకు సంబంధించి టేబుల్స్, వడ్డన ప్రత్యేకంగా చేస్తున్నారు. చిన్న చిన్న శుభకార్యాలు, బర్త్‌డేలు, గృహప్రవేశాలు, డోలాహరణం, కేశఖండనం, ఎంగేజ్‌మెంట్, ఉద్యోగ విరమణ, తదితర కార్యక్రమాలకు సైతం క్యాటరింగ్ విధానంతో భోజనాలను సరైన సమయానికి అందిస్తున్నారు. అతిథుల సంఖ్య, వెరైటీలకు అనుగుణంగా ధరలు ఉంటుండడంతో, అనేక మంది క్యాటరింగ్ వారితో విందు భోజనాలను వడ్డించడానికి ఆసక్తి చూపుతూ వంట చేసే, చేయించే ఇబ్బందిని తప్పించుకుంటున్నారు.

నగరాలకు దీటుగా..



నగరాలకు దీటుగా తక్కువ బడ్జెట్‌తో ఎలాంటి శుభకార్యమైన, వివాహాలైనా నిర్వహిస్తున్నాం. వెయిటర్స్ నుంచి డ్యాన్సర్ల వరకు, సంగీతం నుంచి క్యాటరింగ్ వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ ఈవెంట్‌కు వంద మందికి పైగా యువకులకు ఉపాధి కల్పిస్తున్నాం.

-పవన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకుడు

నచ్చినట్లు విందు భోజనాలు



వివాహాది శుభకార్యాలు జరుపుకునే వారు అతిథులకు ఇష్టమైన వంటకాలను అందించడానికి శ్రమ లేకుండానే వారికి ఇష్టమైన వంటకాలను క్యాటరింగ్ ద్వారా అందిస్తున్నాం. నాలుగు రోజుల ముందు ఆర్డర్ ఇస్తే ఇబ్బందులు లేకుండా నిర్ణత సమయానికి భోజనాలు అందిస్తున్నాం.

- గణేష్, క్యాటరింగ్ నిర్వాహకులు

తప్పిన శ్రమ.. యువతకు ఉపాధి

గతంలో శుభకార్యాలు అంటేనే ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం ఈవెంట్ మెనేజ్‌మెంట్ అందుబాటులోకి రావడంతో డబ్బు ఉంటే చాలు ఎంతటి శుభకార్యాన్నయినా సులభంగా చేస్తున్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనే వీరినే ఆశ్రయిస్తున్నారు. దీంతో, యువతకు ఉపాధి కూడా లభిస్తున్నది. ఒక్కో ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ వారు వందమంది వరకు ఉపాధి కల్పిస్తున్నారు. నారాయణఖేడ్‌లోనే దాదాపు నాలుగైదు ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు అందుబాటులో ఉన్నారు. ఒక్కొక్కరూ ఒకే సమయంలో నాలుగైదు శుభకార్యాలను సునాయసంగా నిర్వహిస్తున్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి


బీజేపీ నేతలతో ఎమ్మెల్సీ అంజిరెడ్డి

నర్సాపూర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీగా గెలిపించిన వారి నమ్మకాని వమ్ముచేయకుండా అందరికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. కరీంనగర్- నిజామాబాద్-ఆదిలాబాద్- మెదక్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఆయన శనివారం నర్సాపూర్‌కు వచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్మికులను, మహిళా గ్రూప్ సభ్యులను సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో అన్ని నియోజకవర్గాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేలా ప్రయత్నించాలని మురళీధర్‌యాదవ్ చేసిన విజ్ఞప్తికి ఆయన స్పందిస్తూ ఈ విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా శాసనమండలిలో కూడా ప్రస్తావించి ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేరేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో మురళీధర్ యాదవ్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేసయాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

బయటపడ్డ లుకలుకలు..

ఎమ్మెల్సీ అంజిరెడ్డి పర్యటన సందర్భంగా నర్సాపూర్ బీజేపీలో లుకలుకలు బయటపడ్డాయి. ఆయన నర్సాపూర్ మీదుగా వెళ్తున్నారనే విషయం తెలుసుకుని పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌యాదవ్‌లు ఎవరికి వారే ఎమ్మెల్సీని సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా అధ్యక్షుడు ఓ హోటల్ సమీపంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డిని శాలువతో సత్కరించగా, మురళీధర్‌యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్సీని ఇలా వేర్వేరుగా సన్మానించడంతో ఇద్దరు నేతల మధ్య గ్యాప్ ఉందనే విషయం మరోసారి చర్చకు వచ్చింది. వీరిద్దరూ గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. మల్లేశ్‌గౌడ్ జిల్లా అధ్యక్షుడు అయ్యాక ఇక్కడి నాయకులు అంతా కలిసిపోతారని భావించినా.. ఎమ్మెల్సీని సన్మానించే విషయంలో ఎవరికి వారు అన్నట్లు వ్యవహరించడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

పంచముఖి అంజనేయస్వామి ఆలయంలో

మెదక్ అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ గోసముద్రతీరంలో వెలసిన శ్రీ పంచముఖి అంజనేయస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ దంపతులను శాలువాతో సన్మాంచారు.


మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారదను సన్మానిస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ బృందం

ఆడపిల్లలను చదివించినప్పుడే మహిళా సాధికారత

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో కలం స్నేహం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. మగపిల్లతో సమానంగా ఆడపిల్లలను చదివించినప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుందన్నారు. అనంతరం అతివ పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినీ సంగీత దర్శకులు, కలం స్నేహం వ్యవస్థాపకులు గోపాల్ ఆచార్య, జాతీయ ప్రధాన కార్యదర్శి గీతాశ్రీ, జాతీయ కన్వీనర్ కానుగు రాధిక పాల్గొన్నారు.

మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు జిల్లా జడ్జి స్పోర్ట్స్‌కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి దామోదర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన పారితోషికం చెల్లించాలి

కొండపాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పారితోషికం వెంటనే చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకి చంద్రభాను కోరారు. కొండపాక మండలం దుద్దెడలో శనివారం ఆయన మాట్లాడుతూ గతేడాది చేసిన మూల్యాంకనానికి ఇప్పటికీ పారితోషికం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఈ సంవత్సరం మళ్లీ పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, అయినా పారితోషికం చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి వెంటనే మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయుల పారితోషికాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవర మల్లయ్య, ఆడిట్ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన వర్గీకరణ చేయాలి


కోహీర్‌లో మహా డప్పుల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కోహీర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగలతోపాటు ఎస్సీ ఉపకులాల వారందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచేంద్రమాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోహీర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జస్టిస్ షమీమ్‌అక్తర్ నివేదికలో ఉన్న లోపాలను సరిచేసి ఎస్సీ జాబితాలోని అన్ని కులాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందేలా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అలాగే త్వరలోనే జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ కులానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాదిగలు డప్పు వాయిద్యాలతో అంబేడ్కర్ చౌకీ ప్రాంతం నుంచి కొత్త బస్టాండ్ వరకు డప్పుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవిమాదిగ, జహీరాబాద్ ఇన్‌చార్జి ఉల్లాస్‌మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

'బీడీ' బతుకులు ఆగం

- నెలంత కష్టపడ్డా వచ్చేది రూ. 3 వేలే
- పూట గడవక ఇబ్బందులు
- తగ్గిన పనిదినాలు
- గతంలో రోజుకు కోటి ఉత్పత్తి
- నేడు 70 లక్షలు మాత్రమే
- దూరంగానే నేటితరం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తర్వాత మహిళలకు ఉపాధి కల్పించిన రంగం ఏదైనా ఉందంటే అది బీడీల తయారీయే. ఇంటిల్లిపాది బీడీలు చుట్టే ఇళ్లు కొకొల్లలుగా కనిపించేవి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. పరిశ్రమ సంక్షోభంలో పడటం, సంగం పని దినాలతో పూట గడవని పరిస్థితి, ప్రభుత్వ పింఛన్ కూడా అరకొరగానే అందుతుండటం వంటి కారణాలతో మహిళలు బీడీల తయారీకి దూరమవుతున్నారు. ఇక నేటి తరం అయితే, అటువైపు కూడా చూడటం లేదు.

రామాయంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ఏ ఇంట్లో చూసినా బీడీలు చుడుతూ మహిళలు కనిపించేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. సరైన పని దొరకకపోవడం.. నేటి తరం ఈ పనిపై ఆసక్తి చూపకపోవడంతో పాటు పలు కారణాల వల్ల అనేక మందికి జీవనాధారమైన బీడీ పరిశ్రమ సంక్షోభంలో పడింది. వ్యవసాయం తర్వాత మహిళలకు పని కల్పించిన ఈ రంగం కుదేలైంది.


బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు(ఫైల్)

నిత్యం ఐదు కోట్ల బీడీలు

మెదక్ జిల్లాలో గతంలో రోజుకు ఐదు కోట్ల వరకు బీడీలు ఉత్పత్తి అయ్యేవి. ప్రస్తుతం 70 లక్షల బీడీలు మాత్రమే తయారవుతున్నాయి. ఇందుకు కారణం మార్కెట్‌లో మినీ సిగరెట్లు రావడం, నేటితరం సిగరెట్లపై మోజు పెంచుకోవడంతో పరిశ్రమపై ప్రభావం చూపింది. దీంతో కంపెనీలు మహిళకు కావాల్సినంత పని కల్పించడంలేదు. కావాల్సినంత ముడి సరుకు ఇవ్వకపోవడం, నెలలో పక్షం రోజులు మాత్రమే పని కల్పిస్తుండటం ఈ వృత్తిని ఎంచుకున్న వారికి పని దొరకడం గగనమైపోయింది. ప్రస్తుతం వెయ్యి బీడీలు చూడితే రూ. 261.97 పైసలు మాత్రమే భత్యం చెల్లిస్తున్నారు. నెలలో తక్కువ పని దినాలు ఉండటం, 15 రోజుల పనికి రూ. మూడు వేల కంటే ఎక్కువ సంపాదించకపోవడంతో బీడీలు చుట్టే కుటుంబాలు ఇబ్బందుల్లో పడుతున్నాయి. పైగా పోరాటాలు చేస్తే తప్ప రేట్లు పెంచడం లేదు.

అందని చేయూత


కంపెనీలో బీడీలు ప్యాక్ చేస్తున్న కార్మికులు

జిల్లాలోని రామాయంపేట ఉమ్మడి మండలంలో సుమారు 12బీడీ కంపెనీలు నడుస్తున్నాయి. వీటి ద్వారా 340 బ్రాంచ్‌ల్లో 64లక్షల బీడీ ఉత్పత్తి అవుతుండగా ఉద్యోగులు, మహిళా కార్మికులు కలిపి 22 వేల మంది ఈ వృత్తిపై ఆధారపడ్డారు. ఈ వృత్తిలో ఉన్న వారు పొగాకుతో కేన్సర్, ఊపిరితిత్తులు పాడవటం లాంటివి రోగాల బారిన పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల కోసం అక్కడక్కడా డిస్పెన్సరీలను ఏర్పాటు చేసినా.. వైద్య సదుపాయాలు అంతంత మాత్రమే ఉన్నారు. కేవలం మందులు ఇచ్చి పంపుతుండటంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఈతరం దూరం..

బీడీల తయారీ రంగంలో మహిళల పాత్రే కీలకం. ఇంటిపనులతోపాటు బీడీలు చుడుతుంటారు. ఆర్థికంగా ఎదుగుబొదుగు లేకపోవడం, తమ పిల్లలు చదువుకుని మంచి స్థానంలో ఉండాలని తల్లిదండ్రులు భావించడంతో నేటి తరాన్ని బీడీల వైపు రాకుండా చూసుకుంటున్నారు. దీంతో బీడీలు తయారు చేసేందుకు కార్మికులు దొరకడం లేదు.

పోరాటాల వల్లే ధరలు పెరిగాయి..



పోరాటం వల్లే వెయ్యి బీడీలకు రూ. పది పెంచారు. గతంలో రూ. 250 మాత్రమే ఇస్తుండగా, రూ.261.97 పైసలు వచ్చే ఏప్రిల్ నుంచి అమలు కానున్నాయి. బీడీ కార్మికులకు తుని కాకు, పొగాకులాంటి ముడి సరుకులు కావాల్సినంతగా ఇచ్చేలా టేకేదార్లను ఒప్పిస్తున్నాం.

- అయ్యవార్ల లక్ష్మణ్, బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

డబ్బులు సరిపోవడం లేదు..



నెల రోజులు బీడీలు చుడితే రూ.3000 కూడా రావడం లేదు. వేరే పని నాకు తెలియదు. చిన్నప్పటి నుంచి బీడీలు చేస్తున్నాను. తక్కువ పని దినాలు కల్పిస్తూ పూట గడవకుండా చేస్తున్నారు. పెన్షన్ డబ్బులైనా పెంచితే కుటుంబాలు గడుస్తాయి.

- రాజమణి, బీడీ కార్మికురాలు

న్యూస్ బాక్స్

సమీకృత హాస్టల్ తనిఖీ

నారాయణఖేడ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని బాలుర సమీకృత హాస్టల్‌ను మున్సిపల్ కమిషన్ జగ్జీవన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్‌లోని వంట గదితో పాటు భోజనాల, సరుకుల నిల్వ గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఆయన వెంట సంక్షేమాధికారి రవీందర్, పండరి, రామప్ప ఉన్నారు.

రూ.11.5కోట్లకు చేరిన పన్నుల వసూళ్లు

ఐడీఏబొల్లారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో శనివారం ముమ్మరంగా పన్నులు వసూలు కార్యక్రమం చేపట్టారు. హంతామాకి పరిశ్రమ వారు రూ.8.5 లక్షల పన్ను చెల్లించారు. పట్టణం అంతటికి ప్రత్యేక బృందాలుగా ఉంటూ వసూలు చేశారు. రూ.16.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.11.51 కోట్లు వసూలు చేశామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ప్రతి ఒక్కరు పన్నులు చెల్లించాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : టాస్క్ ఆధ్వర్యంలో ఈ నెల 10న సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ కంపెనీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ అభ్యర్థులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ, ఎంఎస్సీలో కెమిస్ట్రీ సబ్జెక్టు చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన కోరారు.

కట్టమైసమ్మ ఉత్సవాలు ప్రారంభం

జిన్నారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం అయ్యమ్మ చెరువు కట్టపై వెలసిన కట్టమైసమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. ఈ జాతర మూడురోజుల పాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంపీ.అశోక్, నాయకులు కుమార్, వెంకటేష్, శ్రీరాములు, కృష్ణమోహన్, నర్సింలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ మహోత్సవం

నారాయణఖేడ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పరిధి, నిజాంపేట మండల పరిధిలోని బల్కంచెల్కతండా భక్తిదామంలోని జగన్మాత విశ్వపాలిని జ్వాలాముఖి భవానీ సమేత సేవాలాల్‌మహరాజ్ ఆలయంలో 18వ అష్టాదశ చండీ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు వక్కంతం చంద్రమౌళీశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవంలో ఆలయ ధర్మకర్త, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మూడ్ లలితాకిషన్ పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు మలమంచి మనోజ్‌కుమార్ తీర్థ ప్రసాద వితరణ చేశారు.

రేపు విద్యుత్ అంతరాయం

చేగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సోమవారం చేగుంట మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వంశీకృష్ణ శనివారం తెలిపారు. చేగుంట మండలంలోని 33 కేవీ, ఆర్‌జీఎస్, చంద్రాంచనల్, అనంతసాగర్ సబ్‌స్టేషన్, ఇండస్ట్రీయల్, చేగుంట సబ్ స్టేషన్ నుంచి కర్నాల్‌పల్లి అగ్రికల్చర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో ముస్లిం శ్మశానవాటికను నూతనంగా ఏర్పాటు చేయాలని స్థానిక ముస్లిం కమిటీ బాధ్యులు శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక సరిపోవడం లేదని, అందువల్ల కొత్తది ఏర్పాటు చేయించాలన్నారు. అంతేకాకుండా ముస్లిం షాదీఖానాను కూడా అన్ని వసతులతో నిర్మింపచేయాలని కోరారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సానుకూలంగా స్పందించారు.



నారాయణఖేడ్: ఖేడ్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



మెదక్ కల్చరల్: మెదక్ మండలం పిల్లికోట్‌లోని మెదక్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో మైనంపల్లి రోహిత్



సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని మెడ్విన్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మధుసూధన్‌రెడ్డి

మహిళల ఎదుగుదలతోనే అభివృద్ధి



జహీరాబాద్ పట్టణంలో మాజీమంత్రి చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

మహిళల ఎదుగుదలతోనే అభివృద్ధి సాధ్యమని పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల క్రీడలు, సంగీతం, నృత్య పోటీలను నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

– న్యూస్ నెట్‌వర్క్



రామచంద్రాపురం టౌన్: మహిళా దినోత్సవంలో భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి



పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఏఎస్ఐ కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్ఐ శంకర్, సిబ్బంది



చేగుంట: మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్



నర్సాపూర్: మహిళలను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

మనస్తాపంతోనే కట్ట మైసమ్మ విగ్రహం ధ్వంసం

● నిందితుడి అరెస్ట్... వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని కట్ట మైసమ్మ ఆలయంలో కొన్నిరోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ వెల్లడించారు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన సింగీతం బుచ్చప్ప (52) చందానగర్‌లోని మంజీరా వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. కొద్దిరోజుల క్రితం అతని భార్య మతిస్థిమితం సరిగ్గా లేక అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి బుచ్చప్ప మద్యానికి బానిసయ్యాడు. అదే క్రమంలో గతనెల 24న తన స్నేహితుడు ఇసాక్‌తో కలిసి చెరువు కట్టపై మద్యం సేవించాడు. అప్పటికే తీవ్ర మనస్తాపంతో ఉన్న బుచ్చప్ప



సమావేశంలో వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

దేవుడు తనకు అన్యాయం చేశాడని కోపాన్ని పెంచుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న రాయిని తీసుకొని కట్టమైసమ్మ గుడిలోకి వెళ్లి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శనివారం బుచ్చప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు

● ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

అల్లాదుర్గం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. శనివారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.1 కోటితో 5ఎంబీఏ మెగావాట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి, మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ఎలాంటి లోటు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని



గడిపెద్దాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న బాలస్వామి

చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, డీఈఈ చాంద్‌పాష, ఏడీఏలు మోహన్‌బాబు, శ్రీనివాస్, ఏఈ యాసిన్‌అలీ, సబ్‌ఇంజనీర్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఉట్టిపడిన ఆధ్యాత్మిక శోభ

సంగారెడ్డి రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. బర్దిపూర్ అవధూత పీఠం పీఠాధిపతి రథోత్సవం సంగారెడ్డిలోని పురవీధుల మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు సాగింది. అనంతరం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని ఓ గార్డెన్‌లో బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర నందగిరిమహరాజ్‌ను వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా 1008 శిఖామణి అవధూతగిరిమహరాజ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా 140 ఏళ్లకో సారి జరుగుతుందని, ఈ కుంభమేళాలలో మొదటి రోజే బర్దిపూర్ సిద్ధేశ్వరానందగిరి మహరాజ్‌కు ప్రయాగ్‌రాజ్ ఆధ్వర్యంలో 1008 మహా మండలేశ్వర్ అని బిరుదులు ఇచ్చి సత్కరించారన్నారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన భక్తులకు త్రివేణి



సిద్ధేశ్వర నందగిరిమహరాజ్‌ను సన్మానిస్తున్న వీరశైవ జంగమ సమాజం నాయకులు

సంఘమం నుంచి తీసుకువచ్చిన తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ జంగమ సమాజం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరేశం, శివకుమార్, గంగాదర్, మహేశ్వర్, విశ్వప్రసాద్, సోమనాథ్, శివప్రసాద్, చంద్రశేఖర్, విజయ భాస్కర్, బసవేశ్వర్, సురేష్, ప్రభాకర్, వైద్యనాథ్, బిక్షపతి, వేరేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

రామాయపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఇందుకోసం అత్యధిక నిధులు మంజూరు చేయించి విద్యకు ప్రోత్సాహాన్ని అందిస్తానన్నారు. రామాయంపేటలో శనివారం సాయంత్రం జరిగిన శిశుమందిర్ మూడో వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎంతో క్రమశిక్షణతో శిశుమందిర్ పిల్లలకు ఆటపాటలు నేర్పుతూ చక్కటి బోధన అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, డాకి స్వామి, అల్లాడి వెంకటి, దేమె యాదగిరి, అశ్విని, శారద రాజు, లక్ష్మణ్‌యాదవ్, శిశుమందిర్ ప్రధానాచార్యులు కవిత పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారుల వేషధారణలు ఎంతగానో అలరించాయి.

వైభవంగా బోనాల ఊరేగింపు

పుల్‌కల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు 11వ తేదీవరకు కొనసాగనున్నాయి. ఐదోరోజైన శనివారం గ్రామంలో స్వామివారికి మహిళలు పెద్దఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఇప్పటికే వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య మల్లికార్జునస్వామి విగ్రహం, ధ్వజ స్తంభం ప్రతిష్ఠోత్సవ క్రతువును పూర్తిచేశారు. 9న మల్లన్న భ్రమరాంబ క్యాతమ్మ కల్యాణం, 10న నాగవెల్లి, వేషాలు, ఉన్నిగోలు, సల్లలు చేయుట, 11న కడుపలు కడుగుట వంటి కార్యక్రమాల నిర్వహణతో మహోత్సవాలు ముగియనున్నాయి.

అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండల పరిధి వెలిమెలలోని లక్ష్మీ అనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి కల్యాణంలో మాజీ కౌన్సిలర్లు సుచరితకొమురయ్య, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి దంపతులు కూర్చున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఛైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, తెల్లాపూర్ పుర ప్రముఖులు వివిధ పార్టీల నాయకులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠలో పద్మారెడ్డి

మెదక్ కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండలం పేరూరు గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం.లావణ్యరెడ్డి పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

● ఈజీఎస్ ఏపీవో సుధాకర్

అల్లాదుర్గం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అందరికీ ఉపాధి పనుల కల్పిస్తామని ఈజీఎస్ ఏపీవో సుధాకర్ కూలీలకు సూచించారు. శనివారం మండలంలోని గడిపెద్దాపూర్‌లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. రైతులు కోరుకున్న పనులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. ప్రధానంగా బీడువారిన ఎస్సీ, ఎస్టీ భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని, ఉపాధి నిధులతో ఈ భూములను సస్యశ్యామలం చేయనున్నామని, ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ మొగులయ్య తదితరులు ఉన్నారు.

'సెయింట్ ఆంథోనీస్'లో ఎస్‌డీజీ కార్యక్రమం



సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో శనివారం సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యారంగంతో పాటు వివిధ రంగాల్లో విద్యార్థుల సృజనాత్మకత, భాష నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలను మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పాఠశాల చైర్మన్ ఆంథోనీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, నాటకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో హనుమాన్ ఆలయం కిటకిట



ఖేడ్ మండలం కొండాపూర్‌లో దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

నారాయణఖేడ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొన్నది. స్వయంభువుగా వెలసిన హనుమంతుడిని దర్శించుకోవడానికి నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో ఉదయం అభిషేకం, చందనం, హారతి, తదితర కార్యక్రమాల అనంతరం భక్తుల సహకారంతో మహాప్రసాద వితరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆశీస్సులు అందించారు. అలాగే జోఫూరు లొంక హనుమాన్ ఆలయంలో పాటు కల్పనా హనుమాన్ ఆలయం, మంగల్‌పేటలోని హనుమాన్ ఆలయం, నిరార్‌కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున దర్శనానికి వచ్చారు.

20వ రోజు వంట చేసి నిరసన

నర్సాపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి సమీపంలో డంపింగ్ యార్డు వద్దంటూ నర్సాపూర్‌లో చేపట్టిన దీక్ష శనివారం 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షలో 8వ వార్డుకు చెందిన అఖిలపక్షం నాయకులు పాల్గొని మధ్యాహ్నం దీక్ష వద్దనే వంటకాలు చేసి విన్నూతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణ, మాజీ కౌన్సిలర్ రామచందర్, నాయకులు జగదీష్, శ్రీనివాస్, నారాయణ, సుబ్బులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం రోజు సెలవు ఇవ్వకపోవడం బాధాకరం

చేగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజువల్ సెలవు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. శనివారం చేగుంటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా దినోత్సవం రోజు మహిళా ఉపాధ్యాయుల చేత విధులు నిర్వహించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో సమయపాలన ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా ఉండాలని, మహిళ నైట్ కేర్ టేకర్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు సురేందర్, మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, తదితరులు ఉన్నారు.

పుస్తెలతాడు చోరీ చేసేందుకు యత్నం

● పట్టుకొని దేహశుద్ధి చేసిన స్థానికులు

● పోలీసులకు అప్పగింత

హత్నూర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన కల్లు విక్రయిస్తున్న మహిళపై దాడిచేసి మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం జరిగింది. నాగారం గ్రామానికి చెందిన చిప్పల్‌తుర్తి సుగుణ కొంత కాలంగా ఆ గ్రామ సమీపంలో వడ్డేపల్లి-సోలక్ పల్లి ప్రధాన రోడ్డు పక్కన కల్లు విక్రయిస్తూ ఉంటుంది. రోజువారి మాదిరిగానే శనివారం మధ్యాహ్నం కల్లు విక్రయిస్తుండగా.. మోటార్ సైకిల్‌పై ఇద్దరు వచ్చి రెండు సీసాల కల్లు కావాలని అడగగా, వారి వద్ద ఉన్న 20 లీటర్ల డబ్బాలో నుంచి మగ్గులోకి కల్లును నింపుతుండగా.. కల్లు కోసం బైక్‌పై నుంచి దిగిన వ్యక్తి ఆ మహిళపై దాడిచేసి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు. ఆ మహిళ అరుపులు, కేకలు విన్న వాహనదారులు స్థానికులు వెంటనే గమనించి అప్రమత్తమై వారిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. బంగారు గొలుసు స్వాధీనం చేసుకొని చోరీకి ప్రయత్నించిన వ్యక్తులను పోలీసులకు అప్పగించారు.



బాధితురాలు సుగుణ

ఆశావర్కర్‌పై అత్యాచారం చేసిన నిందితుడిపై చర్యలేవి

సంగారెడ్డి రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్‌పై నిందితుడు అత్యాచారం చేసి పదిరోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ధ్వజమెత్తారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డిలో శనివారం ప్లకార్డులతో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో దళిత ఆశావర్కర్‌పై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్ ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుం



సంగారెడ్డిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

బానికి న్యాయం చేయాలన్నారు. ఆశావర్కర్లకు రాత్రి సమయాల్లో అదనపు పనులు చేపించే విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశావర్కర్లకు రక్షణ కల్పించాలన్నారు.

నిధుల కోసం ప్రతిపాదనలు

సంగారెడ్డి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకుగాను నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి సుమారు 18 కిలోమీటర్లకు సుమారు రూ.25 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని చెప్పారు. జహీరాబాద్ మండలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల కోసం 8 కిలోమీటర్లు రూ.13 కోట్లు, మొగుడంపల్లి 7 కిలోమీటర్లు రూ.9 కోట్లు, ఝరాసంగంలో 2 కిలోమీటర్లకుగాను రూ.2.5 కోట్లు, న్యాల్‌కల్ 1 కిలోమీటరుకు రూ.1.50 కోట్ల మేర అవసరం ఉంటుందని ప్రతిపాదనలు పంపామన్నారు.